క్లుప్తంగా

నేడు విశ్వకర్మ జయంతిని విజయవంతం చేయాలి

ఒంగోలు సెంట్రల్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారతశాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత రిమ్స్‌లోని జిల్లా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత శాఖాధికారి ఎం.అంజల తెలిపారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. అధికారులు, నాయకులు, విశ్వకర్మీయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పొగాకు కేజీ గరిష్ట ధర రూ.358

ఒంగోలు సెంట్రల్: పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని వేలం కేంద్రాల్లో శనివారం నిర్వహించిన వేలంలో కేజీ గరిష్ట ధర రూ.358 పలికింది. ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు-1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి వేలం కేంద్రాల్లో 150వ రోజు నిర్వహించిన వేలానికి 6,550 బేళ్లు రాగా, 5,176 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,374 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.139, సరాసరి ధర రూ.237.57 పలికింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మరణించిన అరిస్టాటిల్

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన జెట్టి అరిస్టాటిల్ (25) మోటారు బైకుపై వెళ్తుండగా శనివారం సాయంత్రం 7.30 గంటల సమయంలో ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్ సమీపంలో వేగంగా వచ్చిన మినీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరిస్టాటిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీని ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. ప్రత్యక్ష సాక్షులు కొందరు ఇచ్చిన సమాచారం మేరకు మేదరమెట్ల వద్ద లారీని పోలీసులు పట్టుకుని డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఒంగోలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో పూజలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు భక్తులు పూజలు చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణ, విష్ణు సహస్ర నామ పారాయణ జరిగాయి. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీవారికి సువర్ణ అష్టాదళ పద్మపాదార్చన కార్యక్రమం జరుగుతుందని, పాల్గొనే భక్తులు శ్రీగిరి దేవస్థాన కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని శ్రీగిరి ఆలయ నిర్వాహకులు కోరారు.



ఒంగోలు కోర్టు సెంటర్ నుంచి వచ్చిన విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



కొత్తపట్నం మెరైన్ పోలీసులకు శిక్షణ ఇస్తున్న మెరైన్ ఎస్సై సుబ్బారావు



పేర్నమిట్ట వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

జై జై గణేశా.. బై బై గణేశా..!

- వినాయక విగ్రహాలకు ఒకవైపు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు
- మరోవైపు కోలాహలంగా ఊరేగింపులు, ఘనంగా నిమజ్జనాలు

ఒంగోలు మెట్రో: ఒకవైపు గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు కొనసాగుతున్నాయి. అంతేస్థాయిలో మరోవైపు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను కోలాహలంగా ఊరేగించి ఘనంగా నిమజ్జనాలు చేస్తున్నారు. ఎక్కడ చూసినా బొజ్జ గణపయ్యలతో భక్తులు సందడి చేస్తున్నారు. ఒంగోలు మంగమూరురోడ్డు మిలటరీ కాలనీలో గణపతి నవరాత్రుల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు వరసిద్ధి వినాయకస్వామి మండపంలో మహాగణపతికి పంచామృతాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి అష్టోత్తర శతనామావళి పూజ క్రతువులు నిర్వహించారు. కర్పూర హారతితో భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో 19వ వార్షికోత్సవం...

ఒంగోలు హౌసింగ్‌బోర్డుకాలనీ, బ్యాంక్‌కాలనీలో గణనాథునికి 19వ వార్షిక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండపాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించి స్వామివారికి ప్రత్యేక పూజలు, హారతులు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. 1500 మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సముద్రతీరంలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనాలు...

కొత్తపట్నం: వినాయక నిమజ్జనాలను శనివారం ఎనిమిదో రోజు కొత్తపట్నం, ఈతముక్కల, మడనూరు బీచ్‌లలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం సెలవు కావడంతో అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు తీరానికి చేరుకున్నాయి. భక్తులు కూడా అధిక సంఖ్యలో విగ్రహాల వెంట తరలి వచ్చారు. తీరంలో వినాయక విగ్రహాలకు పూజలు చేసి నిమజ్జనం చేశారు. పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు ఆధ్వర్యంలో మెరైన్ సిబ్బంది భక్తులచే అత్యంత జాగ్రత్తగా వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయిస్తున్నారు. ముందుగా మెరైన్ పోలీసులకు శిక్షణ ఇచ్చి ఎటువంటి ప్రాణహాని తలెత్తకుండా విధులు నిర్వహించేలా ఎస్సై చర్యలు చేపట్టారు. బోట్లు, లైఫ్ జాకెట్స్ సిద్ధం చేసుకుని అలల మధ్యలో విధులు నిర్వహిస్తున్నారు. ఎవరైనా లోనికి వెళ్తున్నా.. మునిగిపోతున్నా.. వారిని వెంటనే ఒడ్డుకు చేరుస్తున్నారు. ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి భక్తులు స్వేచ్ఛగా మెలిగేలా చర్యలు చేపట్టారు. ఆదివారం తొమ్మిదో రోజు కావడంతో భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున మెరైన్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులతో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు తెలిపారు.



ఒంగోలు మహేంద్రనగర్‌లో పూజలందుకుంటున్న వినాయకుడు



కొత్తపట్నం సముద్రతీరంలో నిమజ్జనానికి బారులుదీరిన వినాయక విగ్రహాలు



కొత్తపట్నం బీచ్‌లో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

పొగాకు బోర్డు ద్వారా ఎరువులు

- పొగాకు బోర్డు గుంటూరు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్

ఒంగోలు సెంట్రల్: పొగాకు బోర్డు ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందిస్తామని పొగాకు బోర్డు గుంటూరు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్ అన్నారు. ఒంగోలులోని పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ కార్యాలయంలో ఆర్‌ఎం లక్ష్మణరావు అధ్యక్షతన బోర్డు సభ్యులు, రైతు సంఘ నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ దామోదర్ మాట్లాడుతూ రైతులు అక్టోబర్ తొలి వారంలో కావాల్సిన ఎరువులకు డీడీలు తీసిస్తే సరఫరా చేస్తామని తెలిపారు. ఎరువులు అందుకోలేకపోతే సంబంధిత రైతు లెటర్ రాసిస్తే డీడీ నగదు కూడా వెనక్కి ఇస్తామని చెప్పారు. అయితే, రైతులకు అవసరమైన డీఏపీ, సూపర్‌ఫాస్ఫేట్ తగిన మొత్తంలో అందేలా లేవని రైతు సంఘ నాయకులు చెప్పారు. అక్టోబర్ రెండో వారం నుంచి వర్షాలు సకాలంలో ఉంటే నల్ల రేగడి నేలల్లో నాట్లు పడే అవకాశం ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పొద వరప్రసాద్, ఎరువుల కమిటీ అధ్యక్షుడు హరిబాబు, వడ్లెళ్ల ప్రసాద్, అబ్బూరి శేషగిరి, మహేష్, నర్సప్ప నాయుడు, గురవారెడ్డి, ఆళ్ల సుబ్బారావు, నాగినేని భాస్కర్, ప్రతి వేలం కేంద్రం నుంచి వేలం నిర్వాహణాధికారులు, రైతు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న మేనేజర్ దామోదర్, ఆర్‌ఎం, రైతు సంఘ నాయకులు

వినాయకుడికి పూజలు చేసిన మారం



పూజలు చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి



వేలంలో వినాయకుడి లడ్డూ దక్కించుకున్న భక్తుడు

చీమకుర్తి: ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి చీమకుర్తిలోని రెడ్డిబజార్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద శనివారం కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. గణేశ్ విగ్రహం నిమజ్జనం సందర్భంగా పూజలు చేసి ఊరేగింపులో పాల్గొన్నారు. విగ్రహం చేతిలో ఉంచిన లడ్డూను స్థానిక భక్తుడు వేలంలో దక్కించుకున్నాడు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బడే అయ్యపరెడ్డి, పద్మ, బడే దశరథరామిరెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పీవీఆర్ చౌదరికి ఘన నివాళి

ఒంగోలు మెట్రో: సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి శనివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ గుండెపోటుతో మృతిచెందడంపై పలు సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు నివాళులర్పించారు. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడు మరణించాడని ఆవేదన వ్యక్తం చేశారు. కవి, రచయిత నెమ్మాని సీతారామమూర్తితో పాటు ఎర్రన్న సాహితీ పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి ప్రతినిధి కుర్రా ప్రసాదు, తదితరులు చౌదరికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

పంటలను పరిశీలించిన గుజరాత్ బృందం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పలు రకాల పంటలతో పాటు పండ్ల తోటలను గుజరాత్‌కు చెందిన పలువురు రైతులు, వ్యవసాయ సిబ్బంది శనివారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో పంటలను పరిశీలించి ఆమె ద్వారా సాగు పద్ధతులు, వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా రైతు సుజాత మాట్లాడుతూ తాను 40 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు వివరించారు. 40 ఎకరాల్లో అంతర పంటలుగా కంది, సజ్జ, జొన్న, పెసర సాగు చేశామన్నారు. సేంద్రియ ఎరువులతోనే పంటలు మంచిగా పండిస్తున్నట్లు సుజాత వారికి వెల్లడించారు. పంటలకు ద్రవజీవామృతం వాడటం వల్ల భూమి సారవంతంగా తయారవుతుందని వివరించారు. వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

డ్రిప్ అక్రమ మంజూరుపై ఫిర్యాదు

కొనకనమిట్ల: తన పొలంలో బోరు లేకుండా, పంట సాగు చేయకుండానే అధికారులు డ్రిప్ పైపులు మంజూరు చేయడంపై మండలంలోని చింతగుంట గ్రామ మాజీ సర్పంచ్ రాగి గురవయ్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు శనివారం తెలిపారు. వివరాలు.. చింతగుంట గ్రామానికి చెందిన వసంతపురం వెంకటచెన్నయ్యకు ఆరు ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉంది. దీనిలో వర్షాధార పంటలు సాగు చేస్తుంటాడు. అయితే వెంకటచెన్నయ్య తన పొలంలో బోరు ఉన్నట్లు, పంటలు సాగు చేస్తున్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించి సంబంధిత అధికారులకు తెలియజేసి అక్రమంగా పూర్తి రాయితీపై డ్రిప్ పైపులు మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. బోర్లు లేకుండా పంటలు సాగు చేయకుండా ఏ అర్హతతో వెంకటచెన్నయకు వేల రూపాయలు విలువ చేసే డ్రిప్, పైపులు మంజూరు చేస్తారని మాజీ సర్పంచ్ గురవయ్య ప్రశ్నించారు. ఇలా మంజూరు చేయటంపై జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకుఅర్జీలు ఇచ్చినట్లు గురవయ్య అన్నారు.

పుష్పాలంకరణ వేడుకకు హాజరైన మాజీ మంత్రి మేరుగు



ఆశ్రితను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్ సీపీ నాయకులు

మద్దిపాడు: మండలంలోని అన్నంగి గ్రామ సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి, అన్వేష్‌ల కుమార్తె ఆశ్రిత పుష్పాలంకరణ వేడుకకు శనివారం రాష్ట్ర మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేరుగు నాగార్జున హాజరయ్యారు. మండలంలోని వెల్లంపల్లి సమీపంలో ఉన్న ఆవాస్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రితను మేరుగు నాగార్జున ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో ఆయన భేటీ అయ్యారు. పార్టీపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, నాయకులు మోరబోయిన సంజీవరావు, బెజవాడ రాము, గుడ్డపాతల రవి, పిట్టల ఆంజనేయులు, శ్రీకాంత్, లింగా రామకృష్ణారెడ్డి, మహానందరెడ్డి, తేళ్ల పుల్లారావు, పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నలమలపు కృష్ణారెడ్డి, మారెళ్ల బంగారుబాబు, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, యల్లమందారెడ్డి, పల్లకి సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీలు మేరిగ పద్మ, పల్లకి పద్మకుమారి, దేవదాసు, సర్పంచ్‌లు సుబ్బారెడ్డి, రామాంజనేయులు, పల్లకి రామసుబ్బారెడ్డి, దుడ్డు వినోద్, రాయపాటి రమేష్, రజని, జయమ్మ, సన్నపురెడ్డి రమణమ్మ, తదితర నాయకులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 115 రద్దు చేయాలి

కంభం: ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్ పోస్టులను కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు, ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్స్ లను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరుతూ శనివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఎన్‌ఎం టు జీఎన్‌ఎం దాకా ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రాం వారికి నర్సింగ్ ఉద్యోగాలు.. జీతాలు ఇవ్వాలని జీవో 115 విడుదల చేశారన్నారు. దీని వల్ల చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. నర్సింగ్ వ్యవస్థకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రాం ఆపాలని, స్టాఫ్ నర్సు పోస్టులను స్టాఫ్ నర్సులకు మాత్రమే ఇవ్వాలని గతంలో మంత్రి నారా లోకేష్‌కు, ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. తక్షణమే జీవోను ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు.




కంభంలో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న నర్సులు

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

మార్కాపురం టౌన్: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.లలిత సలోమి అన్నారు. శనివారం రాయవరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గ్రామంలోని తల్లులను పిలిపించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహారం తయారు చేసి వంటలను ప్రదర్శించారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు రక్తహీనతపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలన్నారు. తల్లులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు, గుడ్లు, బాలామృతం ఉపయోగించుకోవాలన్నారు. బృహస్పతి, నాగలక్ష్మి, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళారూపాలు



నర్తనశాల పౌరాణిక సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



కీచక వధ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రంగభూమి కళాకారులు

ఒంగోలు మెట్రో: జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. రంగభూమి సభ్యుడు శ్రీ దిగ్విజయ్, ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి ధేనువకొండ వెంకట సుబ్బారావు నిర్వాహకులుగా వ్యవహరించారు. ముందుగా ఇటీవల మరణించిన జిల్లాకు చెందిన ప్రముఖ గాయకుడు, ఉపాధ్యాయుడు అచ్యుత్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా, గాయకుడిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం శ్రీ కళాప్రకాశం వారి నర్తనశాల పౌరాణిక నాటకంలో ఒక దృశ్యం, శ్రీకృష్ణ మందిరం పౌరాణిక నాటకాలలోని సన్నివేశాలను ప్రదర్శించారు. నటీనటులుగా చిట్టా వెంకట శివప్రసాద్, తిరుమల, అంగలకుర్తి ప్రసాద్ నటించారు. నటీనటులు తమ హావభావాలతో, గాత్రధారణతో, పద్యాలాపనతో విశేషంగా ఆకట్టుకున్నారు. నర్తనశాల (కీచక వధ) పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కళా కార్యక్రమ పరంపరలో భాగంగా ఆచార్య ఆత్రేయ వర్ధంతి నిర్వహించారు. ఆయన గురించి కళాకారుడు జాలాది మోహన్ ప్రసంగించారు. అనంతరం జిల్లాలో పోలీసు ఉద్యోగిగా, రంగస్థల నటునిగా, రచయిత, దర్శకునిగా సేవలందించిన కేవీ సుబ్బారావు వర్ధంతి సందర్భంగా ఆయన గురించి మరో సీనియర్ రంగస్థల నటుడు దిగ్విజయ్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లాలోని అనేక మంది కవులు, కళాకారులు, సాహిత్యవేత్తలు, గాయకులు, గాయనిలు పాల్గొన్నారు. కార్యక్రమం యావత్తూ స్ఫూర్తివంతంగా కొనసాగి కళాభిమానులను అలరించింది.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

కంభం: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిగ్రీ విద్యార్థులకు జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కంభం కౌన్సిలర్ జి. రాజకుమార్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 20 వరకుఆన్‌లైన్ క్విజ్ నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు, పేర్లు నమోదుకు 9154301314 నంబరును సంప్రదించాలని కోరారు.

వాహనం ఢీ.. గేదె మృతి

గిద్దలూరు రూరల్: పట్టణ శివారులోని నంద్యాల రోడ్డులో గల సీఎస్‌ఐ చర్చి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొని ఓ పాడిగేదె మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. ఓ వాహనం రోడ్డును క్రాస్ చేస్తున్న పాడిగేదెను ఢీ కొట్టింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. డ్రైవర్ అక్కడ నుంచి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు.



మృతి చెందిన గేదె



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రం అందిస్తున్న మల్లికార్జున నాయుడు

అవును.. మా వాళ్లు అవినీతి పరులే!

- రేషన్ దందాపై మంత్రికి టీడీపీ నేత ఫిర్యాదు

యర్రగొండపాలెం: ఇప్పటి వరకు ప్రతిపక్షాలు చేసేది కేవలం ఆరోపణలే అని ఆ పార్టీ పెద్దలు గగ్గోలు పెడుతుంటే.. కాదు, టీడీపీ వారి అక్రమాలు నిజమే అని ఆ పార్టీవారే ఫిర్యాదులు చేస్తున్న పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో విచ్చలవిడిగా జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ దందాపై టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నలగాటి మల్లికార్జున నాయుడు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందించడం గమనార్హం. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కులు పక్కదోవ పట్టిస్తున్నారని, వారి భరతం పట్టి రేషన్ అక్రమ రవాణాకు బ్రేకులు వేయాలని కోరినట్లు ఆయన శనివారం తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారని, అక్రమ రవాణా నివారిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.